విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
గురువారం 6, జూన్, 2024

ఎన్నికల విధులు విజయవంతం

సిబ్బందికి జిల్లా కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో విశాఖ జిల్లా అధికారులు, సిబ్బంది అనిర్వచనీయ పాత్ర పోషించారని, అప్పగించిన బాధ్యతల్ని అత్యంత అంకిత భావంతో నిర్వర్తించారని జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహ రించారని, ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహిం చారని ప్రశంసించారు. నోటిఫికేషన్ వెలువడి నప్పటి నుంచి ఫలితాల వెల్లడి వరకు ఎన్నో రకాల ప్రక్రియల్లో అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం అయ్యారని, అవిశ్రాంతంగా పని చేశారని పేర్కొన్నారు. జూన్ 04వ తేదీన ఓట్లు లెక్కింపు ప్రక్రియలో ఉదయం నుంచే అందరూ తమ విధులను అంకితభావంతో నిర్వర్తించి నిర్ణీత సమయానికి ఫలితాలను వెల్లడించడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. విశాఖ పార్లమెంట్, జిల్లా పరిధిలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, వారి పరిధిలోని సిబ్బంది మంచి పనితీరు కనబరిచారని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను, ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించారని కితాబిచ్చారు. నివేదికల తయారీలో కింది స్థాయి సిబ్బంది కూడా ఉత్సాహంగా పని చేశారని, అలాగే ఫలితాల వెల్లడి రోజున మీడియా సెంటర్ ద్వారా సంబంధిత అధికారులు, సిబ్బంది విస్తృత సేవలందించారన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఈ క్రతువుకు అన్ని విధాలుగా సహకరించిన రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, వెనకుండి నడిపించిన ఎన్నికల పరిశీలకులకు, ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందజేసిన జిల్లా రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులకు కృత్ఞతలు తెలిపారు.

ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి జిల్లా యంత్రాంగం పూర్తి పారదర్శక రీతిలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించిందని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్రలో వైసీపీకి దక్కని చోటు

- విశాఖ రాజధాని ప్రకటనే లబ్ధి చేకూరుతుందని ఆశించిన వైసీపీ
- 34 స్థానాల్లో అరకు, పాడేరులోనే గెలుపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైసీపీకి చోటు దక్కలేదు. వెనుకబడ్డ ఉత్తరాంధ్ర ప్రజలను విశాఖ రాజధాని ప్రకటనతో దగా చేద్దామనుకున్న వైసీపీకి ఉత్తరాంధ్రవాసులు ఫ్యాన్ రెక్కలు విరిచేశారు. విలువైన ఉత్తరాంధ్ర భూములను, వనరులను గెద్దల్లా దోచుకున్న వైసిపి పెద్దల తీరుపై ఉత్తరాంధ్ర ప్రజలు విరుచుకుపడ్డారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 34 అసెంబ్లీ స్థానాలు, 5 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. వీటిలో అరకు పార్లమెంట్ స్థానంతో పాటు అరకు అసెంబ్లీ, పాడేరు అసెంబ్లీ స్థానాలు మాత్రమే మళ్లీ వైసీపీ దక్కించుకుంది. మిగతా 32 అసెంబ్లీ స్థానాలు, నాలుగు పార్లమెంటు స్థానాలు కూటమి అభ్యర్థులే గెలుపొందారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు పది కూటమి అభ్యర్థులే గెలిచారు. శ్రీకాకుళం పార్లమెంట్ నుండి మరోసారి రామ్మోహన్ నాయుడు 3,27,901 ఓట్లు భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఇక ఉమ్మడి విజయనగరం జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. విజయనగరం పార్లమెంట్ స్థానం నుండి తొలిసారి గెలుపొందిన కలిశెట్టి అప్పలనాయుడుకు 2,38,216 ఓట్ల మెజారిటీ లభించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలకు 13 స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందగా, నూతనంగా ఏర్పడిన అల్లూరి జిల్లాలో ఉన్న పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాల్లో కొత్త అభ్యర్థులతో మరోసారి వైసిపి విజయం సాధించింది. అరకు పార్లమెంట్ స్థానాన్ని కూడా వైసీపీ నుండి తనుజరాణీ 50,580 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనకాపల్లి పార్లమెంట్ నుండి కూటమి అభ్యర్థిగా బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన సీఎం రమేష్ 2,96,530 మెజారిటీతో గెలుపొందారు. ఇక విశాఖపట్నం పార్లమెంట్‌కు టిడిపి కూటమి నుండి ఎం.శ్రీ భరత్ రెండోసారి పోటీ చేసి 5,04,247 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పది స్థానాల్లో ఇచ్చాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్నపేట, రాజాం (ఎస్సీ), పాలకొండ (ఎస్టీ) టిడిపి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందగా, ఒక్క ఎచ్చెర్ల స్థానం నుండి బిజెపి అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి విజయ నగరం జిల్లాలో ఉన్న తొమ్మిది స్థానాల్లో కురుపాం (ఎస్టీ), పార్వతీపురం (ఎస్సీ), సాలూరు (ఎస్టీ), బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, విజయనగరం, ఎస్.కోట టిడిపి అభ్యర్థులు ఎమ్మెల్యేలు గెలుపొందగా నెల్లిమర్ల నుండి జనసేన ఎమ్మెల్యేగా లోకం నాగ మాధవి గెలుపొందారు. ఇక ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో భీమిలి, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమ, నర్సీపట్నం, పాయకరావుపేట, మాడుగుల, చోడవరం 8 స్థానాల్లో టిడిపి అభ్యర్థులు గెలుపొందగా, విశాఖ దక్షిణ, పెందుర్తి, అనకాపల్లి, ఎలమంచిలి 4 స్థానాల్లో జనసేన అభ్యర్థులు గెలుపొందారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు కూటమి బలంతో గెలుపొందారు.

పర్యావరణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పర్యావరణానికి విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై పర్యావరణ చట్టాలను పటిష్టంగా అమలు చేస్తూ చర్యలు చేపట్టినప్పుడే కాలుష్యాన్ని నివారించవచ్చునని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇస్కఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రాముఖ్యత వివరిస్తూ నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఇస్కఫ్ అధ్యక్షులు సుకుమారన్, సామాజికవేత్త సన్ మూర్తి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణలో అధికార యంత్రాంగం పాలుపంచుకొని ప్రజలకు మేలైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బ తినకుండా మొక్కల పెంపకాన్ని చేపట్టాలని, కొండల, చెట్లు నాశనం చేయడం ద్వారా వినాశనం జరుగుతుందని గమనించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మూర్తి, శేఖర మంత్రి ప్రభాకర్, సన్ మూర్తి, ఉప్పల అప్పలరాజు, ఎం.మధుమతి, సత్యవతి, సూర్య కుమారి, శ్యాంసుందర్, రాం ప్రభు, మధుబాబు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పోర్టు డిప్యూటీ చైర్ పర్సన్, పోర్టు విభాగాధిపతుల సమక్షంలో చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు ప్రారంభించారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ల్యాండ్ రెస్టోరేషన్ స్టాపింగ్ డి సర్టిఫికేషన్, బిల్డింగ్ డ్రాట్ రెసిలియన్స్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు మాట్లాడుతూ పర్యవరణ సంరక్షణలో వ్యక్తిగత బాధ్యత యొక్క ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ పరిసరాల్లో ఒక మొక్కను నాటడం తో పాటు దాని సంరక్షణ బాధ్యతను చేపట్టాలని కోరారు. నాటిన మొక్కలలో 90 శాతం వరకూ పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించడంలో పోర్టు చేపడుతున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు వచ్చే మూడు నెలలో విశాఖ పోర్టు నగర పరిధిలో స్థానిక సంస్థలను మమేకం చేస్తూ 10 లక్షల మొక్కలను నాటాలని ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ఇందుకోసం పోర్టు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు, వ్యాపార భాగస్వాములకు స్థానిక సంస్థలకు అవసరం మేరకు మొక్కలను అందిస్తుందని వెల్లడించారు. వారం రోజులుగా జరుగుతున్న పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా పోర్టు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్ పర్సన్, చీఫ్ విజిలెన్స్ అధికారి, విభాగాధిపతులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమ వివరాలను పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు వివరించారు.

మల్కాపురం: పర్యావరణంలోని వాతావరణాన్ని, జీవులను, నీటిని, వనరులను పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. వివిధ రకాల కాలుష్యాల వల్ల, ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరగడం వల్ల, మొక్కలు నాటక పోవడం వల్ల, జనాభా పెరుగుదల వల్ల, పారిశ్రామికీకరణ వల్ల, నీటిని పొదుపుగా వాడకపోవడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. వీటిని నివారించడానికి ప్రభుత్వం, ప్రజలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే పర్యావరణాన్ని కాపాడడం అలవాటు చేసుకో వాలని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలను నాటాలని, నీటిని పొదుపుగా వాడాలని, ప్లాస్టిక్ వాడకాన్ని కనీస స్థాయికి తగ్గించాలని, నార సంచులను వాడడం అలవాటు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. అంతకుముందు సీనియర్ గ్రంథాలయాధికారి నాగరాజు పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చివరిగా క్విజ్ పోటీని భాగ్యలక్ష్మి నిర్వహించి, విజేతలను ఎంపిక చేశారు. వీరికి ముగింపు సమావేశంలో బహుమతులను అందజేస్తారు.



ఆనందపురం: పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని భవిష్యత్తులో జరిగే పరిణామాల సందర్భంగా మొక్కలు పెంచడం చాలా అవసరమని ఎన్ఎస్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలో శొంఠ్యాం వద్ద నడింపల్లి సత్యనారాయణ రాజు ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వేస్ట్‌ని తొలగించి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ పీఓ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన వివిధ కార్యక్రమాలలో భాగంగా విశ్వవిద్యాలయం ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ ప్రకృతిలో అడవులు, అరుదైన జంతుజాలాన్ని, జల వనరులను సంరక్షించుకోవడం ద్వారానే భవిష్యత్తులో మానవాళికి మనుగడ అన్నారు. అభివృద్ధి మాటున కోల్పోతున్న సహజ సంపదను తిరిగి వనసంరక్షణ రూపంలో పునః స్థాపించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గీతం జీవశాస్త్ర విభాగాల అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్, జాతీయ సేవాపథకం ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.జి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిఒక్క ఓటరుకు పేరు పేరునా కృతజ్ఞతలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తన కుమారుడు, మనవడు, ఎమ్మెల్సీ మాధవ్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు తదితరులు బుధవారం దర్శించుకున్నారు. విశాఖ దేవాదాయ శాఖ డిసి, ఇన్‌చార్జ్ ఈఓ, సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఆనంద్ కుమార్ పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని తమ తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చేయించారు. డిసి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సింహాద్రి అప్పన్న ఆశీస్సులు వలన ఎమ్మెల్యేగా గెలిచామని అన్నారు. అదేవిధంగా ఎవ్వరూ ఊహించని విధంగా ఇంత భారీ సీట్లు రావటం ప్రజల్లో ఉన్న అవేదన తేట తెల్లమైంది అన్నారు. పంచ గ్రామాల సమస్యను తమ అధినేత చంద్రాబునాయుడు తప్పక పరిష్కరిస్తారని అన్నారు. వీరి వెంట ఆయా వార్డుల కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

ప్రత్యేక హోదాకై కేంద్రానికి మద్దతు పలకాలి

ఆచార్య కె యస్.చలం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్రుల చిరకాల కోరిక రాష్ట్రానికి ప్రత్యేక స్టేటస్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయల సీమకు ప్రత్యేక ప్యాకేజీ సాధించేందుకు కేంద్రానికి మద్దతు తెలపాలని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపకులు, యుపిఎస్సి పూర్వ సభ్యులు ఆచార్య కేఎస్ చలం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ జరగకుండా కొత్త ప్రభుత్వం ముందు ప్రతిపాదన పెట్టాలన్నారు. దానిని దృష్టిలో వుంచుకొని కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాలని కోరారు. రాజకీయాలు అయిపోయాయి కాబట్టి యిప్పుడు అభివృద్ధి అజెండాగా తెలుగు గౌరవం ముందుకు రావాలని ఆకాంక్షించారు.

జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ పనుల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగర సుందరీకరణలో భాగంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో జగదాంబ జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న క్లాక్ టవర్ నిర్మాణ పనులను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కూడళ్లు అభివృద్ధిలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఆకర్షణీయమైన క్లాక్ టవర్ నిర్మాణం చేప ట్టడం జరిగిందని, పనులు దాదాపు పూర్తయ్యా యని క్లాక్ టవర్‌కు ఆకర్షణీయమైన రంగులు వేసి అందంగా తీర్చిదిద్ది, క్లాక్ టవర్ ఆవర ణలో జరుగుచున్న పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని, జగ దాంబ జంక్షన్ రోడ్డు సెంటర్ మీడియన్‌లో ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరం చేసి ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటి నిర్వహణ పనులు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు వినయ్ కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుండి పాత పోస్ట్ ఆఫీస్ వరకు జరుగుచున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. లేపాక్షి జంక్షన్ వద్ద వాహనాలు రాకపోకలకు ఎటు వంటి ఆటకం కలగకుండా సర్కిల్ నిర్మాణం పనులు చేపట్టాలని, అలాగే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు కొత్త రోడ్డు జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు పి.వి.వి.సత్యనారాయణ రాజును ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ పివిడి ప్రసాద్‌రావు, డిడిహెచ్ దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు సుబ్బారావు, సంతోషి, ఏఎంఓహెచ్ రాజేష్, ఏసీపీ ఝాన్సీ, టీపీఓ వినయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.38 లక్షల నిధులతో వసతి గృహంలో వసతులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించాలనే సంకల్పంతో జిల్లా యంత్రాంగం చేపట్టిన విద్యా వసతి వికాసంలో భాగంగా పలు వసతి గృహాల్లో ఆధునిక వసతులు కల్పించిన సంగతి తెలిసిందే. దానిలో భాగంగా స్థానిక ఎం.వి.పి. కాలనీ పరిధిలోని ఎస్సీ సంక్షేమ బాలురు వసతి గృహంలో సీఎస్సార్ నిధులు రూ.38 లక్షలు వెచ్చించి తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు, మరుగుదొడ్లు నిర్మించారు. పెయింటింగ్స్ వేయించారు. ఇతర మరమ్మతులు చేపట్టారు. సుమారు 100 మంది విద్యార్థులు ఉంటున్న వసతి గృహంలో జిల్లా కలెక్టర్ చొరవతో ఆధునిక వసతులు కల్పించారు. విద్యా సంవత్సరం మొదలవుతున్న నేపథ్యంలో వసతి గృహమును బుధవారం జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున ఉపయోగంలోకి తీసుకురావడం జరిగింది.

92వ వార్డులో విజయోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం, 92వ వార్డు పద్మనాభ నగర్‌లో ఎన్డీఏ కూటమి విజయంపై తమ సంతోషాన్ని సంబరాలుగా చేసుకున్నారు. ఎమ్మెల్యేగా పశ్చిమ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధించిన గణబాబుకు, పార్లమెం టుకు పోటీ చేసి మన రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన శ్రీ భరత్‌కు విజయం మరువరానిదని, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అద్భుతమైన విజయం సాధించిందని విశాఖ టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నంద వరపు సోములు అన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలందరికీ స్వీట్లు పంచారు. ఈ కార్య క్రమంలో కంపర అప్పారావు, కంపర కనక రాజు, కంచిపాటి నాగరాజు, కంపర నర్సింగ రావు, కట్ట పెంటయ్య, కంచిపాటి వెంకట రమణ, వల్లూరి జగదీష్ చంద్రశేఖర్, కంపర శంకర్రావు, బి.నాగేశ్వరరావు, సీతమ్మ నాయుడు, వి.వెంకట్రావు, ఎం.వెంకట్రా వు, శ్రీపతి రాజేష్, గనిశెట్టి శ్రీనివాసరావు, నందవరపు హరనాథ్, కెవి సూర్యనారాయణ, మడక తాతరావు పాల్గొన్నారు.

డబుల్ హ్యాట్రిక్ అదృష్టవంతులం

చంద్రబాబు సరసన చోటు దక్కడం నా అదృష్టం
రాజకీయ రజతోత్సవ వేళ రికార్డు మెజారిటీ
సైకిల్‌కు పవర్ ఇంజన్ బూస్ట్ పవన్ కళ్యాణ్
భీమిలి పార్టీ శ్రేణుల కృతజ్ఞతా సమావేశంలో గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - భీమిలి: ఆరు ఎన్నికల్లో విజయం సాధించిన రికార్డును పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతో కలిసి పంచుకోవడం ఆనందంగా ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. చిరస్మరణీయమైన విజయాన్ని అందించిన భీమిలి నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. భీమిలి టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. టీడీపీలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఏడుసార్లు, ధూళిపాళ్ల నరేంద్ర ఆరుసార్లు గెలిచినప్పటికీ మధ్యలో ఓటమిని ఎదుర్కొన్నారని తెలిపారు. రాజకీయాల్లో రజతోత్సవ సంవత్సరమైన 2024 డబుల్ హ్యాట్రిక్ విజయంతో పాటు 92 వేలకు పైబడిన రికార్డు మెజారిటీని అందించిందని ఆనందం వ్యక్తం చేశారు. భీమిలి ప్రజలు సొంత కుటుంబ సభ్యుడి కన్నా ఎక్కువగా ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పారు. భీమిలిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, ప్రజల అంచనాలకు తగ్గట్టు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భారీ మెజారిటీ కోసం ఎన్నికల్లో కష్టపడిన భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, మధురవాడ, సింహాచలం, ఎల్లపువానిపాలెం, నగరంలోని కొండవాలు ప్రాంతాల నాయకులు, కార్య కర్తలను అభినందించారు. లోకల్ మేనిఫెస్టో అమలుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ సైకిల్ గుర్తుకు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పవర్ ఇంజన్ బూస్ట్ తోడైందని, అందుకే ఎవరూ ఊహించని సీట్లు, మెజారిటీలను సాధించామని గంటా అన్నారు. జగన్ అరాచక పాలనను అంతమొదించాలన్న ఏకైక లక్ష్యంతో తన బలానికంటే తక్కువ సీట్లకు రాజీ పడి వంద శాతం సీట్లలో గెలిచి రికార్డు సృష్టించారని చెప్పారు. అరాచకం, విధ్వంసంతో అనుక్షణం భయపెట్టిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. వన్ టైం సీఎంగా చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గంటా రవితేజ, టిడిపి పార్టీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, గాడు వెంకటప్పడు, డి.ఎ.వి.రాజు, గోపీ రాజు, జనసేన నాయకుడు ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ▸ విశాఖపట్నం
పేజి : 2
గురువారం 6, జూన్, 2024

మరువలేని విజయాన్ని అందించారు

జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: రాష్ట్రంలో చరిత్రలోనే మర్చిపోలేని విజయమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో కూటమికి పట్టం కట్టారని, వైసిపి నాయకులకు ఏం జరిగిందో అర్థంకాక ఏడుపు ముఖం పెట్టు కున్నారని అన్నారు. కూటమి 56.99 శాతంతో 164 సీట్లు కైవసం చేసుకున్నామని, ఐదేళ్ళ వైసిపి పాలన వ్యతిరేకిస్తూ, కూటమికి భారీ మెజారిటీ ఇచ్చారని అన్నారు. ఎప్పుడు బటన్ నొక్కడం తప్ప ఏం చేశారో చెప్పలేదని, ప్రజలను నానా ఇబ్బందులు పెట్టారని, వైసిపి పాలనలో ఉత్తరాంధ్ర వెనుకబడిందన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చిన సొమ్ములు కూడా వాడేశారని ఆవేదన వెలిబుచ్చారు. అందుకే ప్రజలు ఈవీఎం మిషన్స్‌లో ఇన్ని ఓట్లు ఇచ్చారని అన్నారు. చంద్రబాబు నాయుడు విశాఖకు ఐటి కంపెనీలు తెస్తే వాటిని తరిమేశారని తెలిపారు. ఇప్పటి నుండి సుస్థిర పాలన దిశగా మన రాష్ట్రం అడుగులు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాసనమండలి సభ్యులు డాక్టర్ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారని, ఈ తీర్పు దేశానికి ఒక రిఫరెన్స్ అని, ప్రతి రాజకీయ నాయకుడు ఒక పాఠంగా తీసుకోవాలన్నారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్రులు విజ్ఞులు అని వారు ఏ సమయంలో ఏ నిర్ణయాలు తీసుకోవాలో వారికి బాగా తెలుసు అని అన్నారు. హుదూద్ తుఫాన్ సమయంలో ఇక్కడే ఉండి చంద్రబాబు చేసిన సేవను విశాఖ ప్రజలు మర్చి పోలేదని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలని, తాగునీటి ప్రాజెక్టులు పడకేసాయని, ఇవన్నీ కూడా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందనన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రాష్ట్రానికి పోయిన పరువు బ్రాండ్ మళ్ళీ తిరిగి తీసుకొస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపా ధ్యక్షుడు గొంపా సత్య నారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కిరెడ్డి జగదీష్, పొడుగు కుమార్ పాల్గొన్నారు.

ఓటమిపై విశ్లేషించుకుంటాం

అభివృద్ధి కోసం నా పోరాటం ఆగదు

మీడియాతో మాట్లాడిన కేకే రాజు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ఎన్నికల ఫలితాలపై వైసీపీ విశ్లేషించుకుని, ప్రజా సమస్యలపై పోరాడుతామని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం విశాఖ ఉత్తర నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేకే రాజు మాట్లాడారు. గత 25 సంవత్సరాలుగా నాకు రాజకీయాలు అంటే చాలా ఆసక్తి అయి, రాజకీయాలపై విశ్లేషించడం, రాజకీయ పత్రికలు చదవడం అంటే చాలా ఇష్టమని అన్నారు. ఆ ఆసక్తితోనే ప్రజాసేవ చేసేందుకు గత ఆరు సంవత్సరాల క్రితం ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం జరిగిందని అయిఒఎఐఅ. అప్పటినుండి ప్రజలతో మమేకమవుతూ 2019 ఎన్నికల్లో పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినప్పటికీ అప్పటినుండి ప్రజల మధ్యలో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఈ విశాఖ ఉత్తర నియోజకవర్గంలో చేపట్టడం జరిగిందని అన్నారు. అనేక పెట్టుబడులను ఈ నియోజకవర్గంలో తీసుకురావడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం జరిగిందని అన్నారు. నా వ్యాపారం, వ్యక్తిగత జీవితం, ఫ్యామిలీ కంటే ప్రజలతోనే ఎక్కువ మమేకమైపోవడం జరిగిందని అన్నారు. గత 6 సంవత్సరాలలో ప్రతి గడపకు వెళ్ళడం జరిగిందని అన్నారు. కూటమి నాయకులు అధికారం కోసం వారు అవలంబించిన వివిధ ఆలోచనలు వారికి ఫలించాయని, దానికి తోడు మా పార్టీ ఏమరపాటే ఈ ఓటమికి కారణం అయి ఉండొచ్చని భావిస్తున్నానని అన్నారు. 2019 ఎన్నికలల్లో 3 పార్టీలకి విడిగా పడిన ఓట్లు.. ఈసారి కూటమిగా ఏర్పడటంతో ఆ ఓట్లు అన్ని ఆయా కూటమి అభ్యర్థికి పడటంతో కూటమి

విజయానికి కారణం అయ్యిందని అన్నారు. మా ప్రభుత్వం సచివాలయం వ్యవస్థ ద్వారా చేపట్టిన అనేక సంక్షేమ ఫలాలు ద్వారా ప్రజలకు మంచి జరిగిందని, కాని లబ్ధిదారులకు మా పార్టీ నాయకులకు సమన్వయం లేకపోవడంతో కూడా పార్టీకి అన్యాయం జరిగిందని భావిస్తున్నానని అన్నారు. విశాఖ అంటే నాకు పిచ్చి ప్రేమ అని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం నా పోరాటం ఆగదని అన్నారు. ఏది ఏమైనా కూటమి తరుపున గెలిచిన అభ్యర్థులకు నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. గెలిచిన కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. గత 6 సంవత్సరాలలో నేను చేపట్టిన ప్రతీ కార్యక్రమం వెంట సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, మీడియా మిత్రులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, జీవీఎంసీ వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, మాజీ వుడా చైర్మన్ రవితో పాటు పలువురు పార్టీ నేతలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రజల తీర్పును స్వాగతిస్తున్నా

అంతుచిక్కని ఫలితాలపై అనుమానాలున్నాయి

– దక్షిణ వైసీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: నిరంతరం ప్రజల తోనే ఉండి నిస్వార్థంగా సేవలందించినప్పటికీ వారు ఆదరిం చకపోవడం పట్ల చింతిస్తున్నామని దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. దక్షిణ వైసీపీ శ్రేణులతో బుధవారం ఉదయం ఆశీలమెట్ట కార్యాలయంలో సమావేశం అయ్యారు. ముందుగా తాను అందించిన సేవలో ప్రతి అడుగులో అడుగు వేస్తూ నడిపించిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపు ఓటములు సహజమని, ఎవరు అధైర్యపడవద్దని కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధితో పాటు, తాను కూడా సహాయం అన్నవారికి సొంత నిధులతో ప్రజలకు ఇంటి వద్దకు వెళ్లి సాయం అందించి అండగా నిలిచామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అభివృద్ధి అందించడంలో ఇంతకన్నా ఎవరు చేస్తారన్నారు. కోట్లాది రూపాయలు అవినీతి లేకుండా ప్రజల ఖాతాల్లోకి చేరవేస్తే ఫలితంగా అవ్వ తాతలు, మహిళలు అందించిన ఆశీర్వచనాలు ఏమయ్యాయో అనే సందేహం కలుగుతుందన్నారు. దక్షిణంలో మత్స్యకారుల కోసం, ముస్లిం సోదరులు, ప్రజల కోసం వారంలో మూడు రోజుల ప్రజాదర్బార్లు పెట్టి సేవలందించామన్నారు. కుటుంబ సభ్యుల కన్నా ప్రజల కోసం సమయాన్ని ఎక్కువ కేటాయించి వారికి అందుబాటులో ఉన్నప్పటికీ ఓటమిపాలయ్యామన్నారు. నిజంగా ఓటమి చెందితే ఇంత దారుణంగా ఫలితాలు వెలు వడటం పార్టీ క్యాడర్లో పలు అనుమానాలకు దారి తీశా యన్నారు. ఓడినా, గెలిచినా ప్రజల పక్షాన పనిచేస్తామని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. గెలిచిన కూటమి అభ్య ర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మంచి జరిగేలా సేవలు అందాలని ఆకాంక్షించారు. సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, కార్పొరేటర్లు కొండమ్మ, తోట పద్మావతి, చెన్నా జానకిరామ్, మాసిపోగు మేరీ జోన్స్ రాజు, రామానంద్, మాజీ కార్పొరేటర్ అమ్మాజీ, దక్షిణా వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం పాలెంలో

టిడిపి నేతలు సంబరాలు..

విశాలాంధ్ర – పీఎం పాలెం: జీవీఎంసీ జోన్ 2 పరిధి 6వ వార్డు పిఎం పాలెం టీడీపీ కార్యాలయం వద్ద విశాఖ తెలుగు యువత ఉపాధ్యక్షులు కే వి ఆర్ క్యాటరింగ్స్ అధినేత గరే గురునాథ్ ఆధ్వర్యంలో కూటమి నేతలు తో కలిసి బుధవారం సంబరాలు జరుపుకున్నారు.

గురునాథ్ మాట్లాడుతూ ఈ విజయంలో భాగస్వామ్యమైన ప్రతీ ఒక్కరికి ఈ విజయం అంకితమని, వైసీపీ నాయకులు ప్రవర్తించిన తీరు రాష్ట్ర ప్రజలు విసిగిపోయి సరైన తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షులు సంతోష్ నాయుడు, వీర మహిళా పొతిన అనురాధ, వార్డు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యన్నారాయణ, పొతిన రమణ, పొతిన నాయుడు, భాష, కరీం, కనకరావు మాస్టర్, వండ్రాశి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రియేటర్ యూనివర్సిటీ క్రియేటర్ కనెక్ట్ ప్రారంభించిన అమెజాన్ డాట్ ఇన్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: అమెజాన్ డాట్ ఇన్ ఈరోజు క్రియేటర్ యూనివర్సిటీ, క్రియేటర్ కనెక్ట్‌ను ప్రారంభించినట్లు అమెజాన్ షాపింగ్ ఎక్స్పీరియన్స్ ఇండియా ఎమర్జింగ్ మార్కెట్స్ డైరెక్టర్ కిషోర్ తోట చెప్పారు. క్రియేటర్ యూని వర్సిటీ అనేది డైనమిక్ క్రియేటర్ ఎకానమీలో అభివృద్ధి చెందడానికి అవసరమైన సాధనాలు జ్ఞానంతో కంటెంట్ సృష్టి కర్తలను సన్నద్ధం చేయడానికి రూపొందించబడిన విద్యా కార్యక్రమం అన్నారు.

పేరొందిన ఔత్సాహిక ప్రభావశీలులను కలిగి ఉండే ఈ ప్రోగ్రామ్ కంటెంట్ సృష్టికర్తల యొక్క విస్తృత అవసరాలను తీరుస్తుందన్నారు.

వనరుల యొక్క ప్రత్యేక ఎంపిక ద్వారా, అమెజాన్ మార్కెట్‌ప్లేస్‌లో స్థిరమైన వ్యాపారాన్ని పెంపొందించడానికి ఈ ప్రోగ్రామ్ పాల్గొనేవారికి ఫౌండే షనల్ జ్ఞానం ఆచరణాత్మక

విశాఖ జిల్లా విజేతలకు అభినందనల వెల్లువ

రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ పొందిన ఎంపీగా శ్రీ భరత్, ఎమ్మెల్యేగా పల్లా శ్రీనుకు ప్రశంసలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: కూటమి ప్రభంజనంలో భారీ మెజారిటీతో గెలుపొందిన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యే, ఎంపీలకు అభినందనలు వెల్లువెత్తాయి. తాజాగా గెలుపొందిన కూటమి అభ్యర్థులు విజయవాడ బాటపడ్డారు. టిడిపి అధినేత చంద్రబాబును, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తోపాటు ముఖ్య నేతలను విశాఖ జిల్లా టిడిపి, జనసేన కూటమి విజేతలు బుధవారం ఉదయం కలిసి అభినందనలు తెలియజేశారు. గాజువాక టిడిపి ఎమ్మెల్యేగా రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావును ఈ సందర్భంగా చంద్ర బాబు, లోకేష్ అభినందించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను పవన్ కళ్యాణ్, నారా లోకేష్ అభినం దించారు. ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యేగా గెలుపొందిన సుందరపు విజయ్ కుమార్‌ను ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి నేత లోకేష్ అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో విశాఖ ఎంపీగా గెలుపొందిన శ్రీ భరత్‌ను చంద్రబాబుతో పాటు కుటుంబ సభ్యులు, మామ బాలకృష్ణ కుటుంబ సభ్యులు అభినందించారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు

విశాఖలో ప్రమాణ స్వీకారం చేయాలి

ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయాలనేది ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష అని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. భీమిలి ఎమ్మెల్యేగా గంట శ్రీనివాసరావు ఘన విజయం సాధించిన నేపథ్యంలో బుధవారం బి.వి.రామ్ కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తానని చెప్పడాన్ని ఉత్తరాంధ్ర ప్రజలు ఏమాత్రం అంగీకరిం చలేదన్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా.. ఉత్తరాంధ్రలోని మొత్తం 34 అసెంబ్లీ నియో జకవర్గాలలో 32 నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించారన్నారు. అఖండమైన ప్రజల తీర్పు ద్వారా ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతి మాత్రమే కొనసాగాలనే విషయం మరోసారి స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలోనే ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు విశాఖలో ప్రమాణ స్వీకారం చేయాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా వైసీపీ నేతలు విశాఖ పరిపాలన రాజధాని పేరుతో భీమిలి నియోజకవర్గంలోనే ఎన్నో భూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ పరిస్థితులలో అన్ని అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను చట్టం ముందు నిలబెట్టవలసిన అవసరం ఉందన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రజా వ్యతిరేక పాలన కారణంగానే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు వైసీపీని ఘోరాతి ఘోరంగా ఓడించారన్నారు. గంటా శ్రీనివాసరావుని కలిసిన వారిలో విశాఖ పార్లమెంటు తెలుగు దేశం కమిటీ కార్యదర్శి బోడేపూడి దొరబాబు, డాక్టర్ పఫూర్ నికుంజ్, తెలుగు దేశం నాయకులు తోకల శివ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబును ఆయన క్యాంప్ ఆఫీస్‌లో కలిసి శాలువతో సత్కరించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర – మల్కాపురం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హెచ్పిసిఎల్ ధాన్ ఫౌండేషన్ మల్కాపురం కళంజియ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మల్కాపురం ఏడుగుళ్ళ జంక్షన్లో గల కమ్యూనిటీ హాలు ప్రాంతంలో కళంజియ సభ్యులకి హెచ్పీసీఎల్ జనరల్ మేనేజర్ భగవాన్ చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా ధాన్ ప్రతినిధి ఖాలీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి మనిషి భాగస్వామి కావాలని, పొదుపు సంఘం మహిళలుగా మీరు మీ కుటుంబాన్ని ఎలాగైతే ఆర్థికంగా అభివృద్ధి చేసుకుంటారో, రక్షించుకుంటాతో అలాగే మన పర్యావరణాన్ని తద్వారా మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవాలని అన్నారు అలాగే ఎల్లప్పుడూ దాన్ ఫౌండేషన్ కు మా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ధాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజనల్ కొనర్డినేటర్ శ్రీ రామ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని, తద్వారా మనం క్షేమంగా ఉండగలమని అన్నారు, అలాగే కళంజియ మహిళలు సామాజిక స్పృహతో ఉంటారని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు, సిబ్బంది , కళంజియ సభ్యులు మరియు ఇంటర్నిప్ లో భాగంగా జోసెఫ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రమజీవుల కాలనీలో

పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర – ఆనందపురం: పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం బొడ్డపాలెం గ్రామం, శ్రమజీవుల కాలనీవాసులు వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలు పేరెంట్స్ కలిసి పర్యావరణం సందర్భంగా పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విసిసి క్లబ్ బాధ్యులు కే.నాగరాణి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడా ల్సిన బాధ్యత అందరిపైన ఉందని ప్రతి ఒక్కరు చెట్లను పెంచాలని మన వంతుగా పర్యావరణానికి చెట్లను నాటి భావితరాలకు బహుమతి ఇవ్వాలన్నారు.

ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వాములు కావాలన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పులతో ప్రజల అవసరాలకు చెట్ల ప్రాముఖ్యత ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, దేవి, కే.నాగరాణి, డి.వరలక్ష్మి (దేవి), మమతా శ్రీ, ఝాన్సీ, జస్వంత్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్మ్ సీరీస్‌లో న్యూ గ్లోస్టర్‌ను విడుదల చేసిన ఎంజీ ఇండియా

విశాలాంధ్ర – విశాఖపట్నం: స్టార్మ్ సీరీస్‌లో న్యూ గ్లోస్టర్‌ను ఎంజీ ఇండియా విడుదల చేసింది. కొత్త ఎంజీ గ్లోస్టర్ స్టార్మ్ సీరీస్ సూక్ష్మంగా రూపొందించబడింది. మరింత విలాస వంతమైన బోల్డ్ రూపం అందిస్తోంది. బ్లాక్ స్టార్మ్ ఎలిమెంట్స్ తో ప్రేరణ చెంది కొత్త ఎంజీ గ్లోస్టర్ డిజర్ట్ స్టార్మ్ డీప్ గోల్డెన్ ఎక్స్టీరియర్‌తో వెళ్లిన ప్రతి చోట ఖచ్చితంగా ఆకట్టుకునే డ్యూయల్-టోన్ పెరల్ వైట్ బ్లాక్ ఎక్స్టీరియర్‌లో స్నోస్టార్మ్ లభిస్తోందని ఎంజీ మోటార్ ఇండియా ఛీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్ సింగ్ బజ్వా అన్నారు. కొత్త గ్లోస్టర్ డిజర్ట్ స్టార్మ్, బ్లాక్-థీమ్డ్ ఇంటీరియర్ డ్రైవింగ్ అనుభవాలను మెరుగుపరచడానికి ఉద్దేశించబడింది.

ఎన్నికైన విజేతలకు అభినందనలు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గేదెల శ్రీనుబాబు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన వారందరికీ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పల్సస్ గ్రూప్ సంస్థల అధినేత గేదెల శ్రీనుబాబు అభినందనలు తెలియజేశారు. తాను కూడా ఈ ఎన్నికల్లో భాగస్వామి నైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజల్ని చైతన్యవంతం చేశానని శ్రీనుబాబు గుర్తు చేశారు. ఈ విజయం ఇంతటితో ఆగ కూడదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అభివృద్ధిపథంలో నడవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.